సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 7 । మార్చి । 2024



టన్ను రూ.18 వేలు
వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టంగా రూ.9 వేలు, సరాసరిన రూ.14 వేల ప్రకారం ధర పలికాయి.



టమాట రూ.14
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.14 ధర పలికింది. మార్కెట్‌కు 250 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం
39.2°/19.4°
జిల్లా పరిధిలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం మొదలైంది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష



పుట్టపర్తి: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు మ్యాథమేటిక్స్ పేపర్-1, బాటనీ-1, సివిక్స్-1 పరీక్ష నిర్వహించారు. 41 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 244 మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి (డీఐఈఓ) రఘునాథరెడ్డి తెలిపారు. జనరల్ విద్యార్థులు 11,197 మందికి గానూ 10,835 మంది హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1,502 మందికి గానూ 1,409 మంది హాజరైనట్లు ఆయన వెల్లడించారు.

వడదెబ్బతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



నీలకంఠ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



నీలకంఠ (ఫైల్)

నల్లమాడ: వడదెబ్బతో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ దంపట్ల నీలకంఠ (25) మృతిచెందారు. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. నీలకంఠ వేళ్లమద్ది గ్రామ పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతానికి వెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంటికి చేరుకున్న ఆయన... మంచినీరు తాగి కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబీకులు 108లో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య రేవతి, ఆరు నెలల కుమార్తె ఉన్నారు. కాగా, బుధవారం ఉదయం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వేళ్లమద్దిలో నీలకంఠ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నీలకంఠ కుటుంబీకులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అంత్యక్రియల కోసం ఆర్థికసాయం అందించారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ బొజ్జే నాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే.సూర్యనారాయణ, నాయకులు టీడీ విజయభాస్కర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీనివాసులు, సీతారాం, హరి, గోవిందరెడ్డి తదితరులున్నారు.

సిలిండర్‌కు అదనపు చార్జీ వసూలు చేస్తే చర్యలు

- హెచ్చరించిన జేసీ అభిషేక్‌కుమార్



మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: వంటగ్యాస్ సిలిండర్ సరఫరాకు వినియోగదారుల నుంచి రవాణా చార్జీని ఏజెన్సీలు వసూలు చేయకూడదని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. ఉత్తర్వులను ఉల్లంఘించే ఏజెన్సీలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డితో కలిసి గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... కొందరు గ్యాస్ డెలివరీ బాయ్స్, ఏజెన్సీ నిర్వాహకులు రవాణా చార్జీల పేరుతో వినియోగదారుల నుంచి రూ.50 నుంచి రూ.100 దాకా అదనంగా వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇక నుంచి బిల్లుకు మించి ఒక్క రూపాయి కూడా ఎక్కువ వసూలు చేయకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే గ్యాస్ ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా, ఎవరైనా వంటగ్యాస్ సరఫరాకు బిల్లుకు మించి అధికంగా వసూలు చేస్తే జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు, ఐఓసీ, హెచ్‌పీఎల్, బీపీసీ గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, సేల్స్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కాపు మహిళల నేస్తం



ఈ చిత్రంలోని మహిళ పేరు గంగమ్మ. అగళి మండలం నరసంబూది. పూలతోటల సాగుపై ఆధారపడి జీవిస్తోంది. కాపు సామాజికవర్గం ఓసీ జాబితాలో ఉండగా, గతంలో ఏ ప్రభుత్వమూ ఆమెకు ఎలాంటి సాయం అందించలేదు. దీంతో గంగమ్మ పూలసాగుకయ్యే పెట్టుబడి కోసం గతంలో అప్పులు చేయాల్సిన పరిస్థితి. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గంగమ్మ జీవితంలో వెలుగులు నిండాయి. 'వైఎస్సార్ కాపు నేస్తం' ద్వారా ఏటా రూ.15 వేలు నేరుగా ఆమె ఖాతాలోనే జమ అవుతోంది. ఇలా నాలుగేళ్లపాటు రూ.60 వేలు లబ్ధి కలిగింది. ఈ మొత్తాన్ని పూలతోటల సాగుకు ఉపయోగించుకున్న గంగమ్మ ఆర్థికంగా నిలదొక్కుకుంది. గ్రామంలోని ఇతర రైతులు పండించిన పూలను కూడా కుడుతూ అదనపు ఆదాయాన్ని పొందుతోంది. 'వైఎస్సార్ కాపు నేస్తం' ద్వారా తనలాంటి ఎందరికో ఆర్థిక చేయూత నిచ్చిన జగనన్నకు రుణపడి ఉంటామని గంగమ్మ చెబుతోంది.

- వైఎస్సార్ కాపు నేస్తంతో మహిళల జీవితాల్లో వెలుగులు
- జీవనోపాధికి ఏటా రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం
- జిల్లాలో 6,980 మంది కాపు మహిళలకు లబ్ధి
- 4 విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.38.49 కోట్లు
- ఐదేళ్లలో ఒక్కో కాపు మహిళకు రూ.75 వేలు
- ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్



'వైఎస్సార్ కాపు నేస్తం' నిధులు అందిన ఆనందంలో మహిళలు (ఫైల్)

మడకశిర: సంక్షేమం..అభివృద్ధికి సమ ప్రాధాన్యత నిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకూ ఆపన్నహస్తాన్ని అందిస్తున్నారు. ఆర్థికంగా ఆదుకుంటూ ఆయా కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా ఓసీ వర్గంలోని కాపు మహిళలకూ ఆర్థిక చేయూత ఇస్తున్నారు. 'వైఎస్సార్ కాపు నేస్తం' ద్వారా నిరుపేదలైన కాపు మహిళల జీవనోపాధికోసం ఏటా రూ.15 వేల చొప్పున ఐదేళ్లలో రూ.75 వేలు అందించేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే నాలుగు విడతల సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయగా, ఎందరో కాపు మహిళలు తమ సొంతకాళ్లపై నిలబడి కుటుంబాలకు ఆసరాగా మారారు.

అర్హతే ప్రామాణికంగా పథకం వర్తింపు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏ సంక్షేమ పథకం అందాలన్నా జన్మభూమి కమిటీల సిఫార్సు అవసరమయ్యేది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకూ మేలు కలిగేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా 'వైఎస్సార్ కాపు నేస్తం' వర్తింపజేస్తున్నారు. 45 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు ఉన్న అర్హులైన ప్రతి కాపు మహిళకూ ఈ పథకం ద్వారా ఏటా రూ.15 వేల చొప్పున లబ్ధి చేకూరుస్తున్నారు. ఇప్పటికే నాలుగు విడతల్లో ఒక్కో లబ్ధిదారు ఖాతాలో రూ.60 వేల చొప్పున జమ చేశారు.

జిల్లాలో 'వైఎస్సార్ కాపు నేస్తం' లబ్ధిదారుల వివరాలు ఇలా...

నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో..)
కదిరి	1,559	8.53
ధర్మవరం	1,169	6.51
పుట్టపర్తి	1,592	8.80
హిందూపురం	727	3.98
మడకశిర	784	4.39
పెనుకొండ	923	5.06
రాప్తాడు	226	1.22
మొత్తం	6,980	38.49

జిల్లాలో రూ.38.49 కోట్ల లబ్ధి

జిల్లాలో 6,980 మంది 'వైఎస్సార్ కాపు నేస్తం' పథకం లబ్ధిదారులుండగా, నాలుగు విడతల్లో రూ. 38.49 కోట్లు మహిళల ఖాతాల్లో నేరుగా జమ అయ్యాయి. అత్యధికంగా పుట్టపర్తి నియోజకవర్గంలో 1,592 మంది 'కాపు నేస్తం' కింద లబ్ధి పొందారు. ఆ తర్వాత కదిరి నియోజకవర్గంలో 1,559 మంది, ధర్మవరం నియోజకవర్గంలో 1,169 మంది, పెనుకొండ నియోజకవర్గంలో 923 మంది, మడకశిర నియోజకవర్గంలో 784 మంది, హిందూపురం నియోజకవర్గంలో 727 మంది, రాప్తాడు నియోజకవర్గంలో 226 మంది చొప్పున లబ్ధి పొందారు.

జగన్‌కు రుణపడి ఉంటా



ఓసీ వర్గంలోని కాపుల్లోనూ చాలా మంది పేదలు ఉన్నారు. కానీ గత ప్రభుత్వాలు కాపుల సంక్షేమాన్ని విస్మరించాయి. కానీ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కాపు మహిళల కష్టాన్ని గుర్తించారు. మా కోసమే ప్రత్యేకంగా 'వైఎస్సార్ కాపు నేస్తం' పథకాన్ని అమలు చేసి ఆర్థిక చేయూత ఇస్తున్నారు. నాకు కాపు నేస్తం ద్వారా ఏటా రూ.15 వేల చొప్పున నాలుగు విడతల్లో రూ.60 వేల సాయం అందింది. జగన్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

–నరసమ్మ, ఆలూడి, అగళి మండలం

ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నా



నాకు 'వైఎస్సార్ కాపునేస్తం' పథకం ద్వారా ఏటా రూ.15 వేలు క్రమం తప్పకుండా అందుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం కాపు మహిళలకు ఆర్థిక చేయూత ఇస్తున్నారు. 'కాపు నేస్తం' నిధులను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నా. నా జీవనోపాధికి ప్రభుత్వ సాయం ఎంతగానో ఉపయోగపడుతోంది. వైఎస్ జగన్ చేస్తున్న మేలు జీవితాంతం గుర్తుపెట్టుకుంటా.

–ఉగ్రమ్మ, నరసంబూది, అగళి మండలం

ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం

- లేకపోతే చంద్రబాబు రాజకీయాల నుంచి తప్పుకోవాలి
- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి సవాల్



డాక్టర్ తిప్పేస్వామి

మడకశిర: పెనుకొండ సభలో చంద్రబాబు తనపై చేసిన ఆరోపణలను నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం చేస్తానని, లేకపోతే ఆయన రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకోవాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి సవాల్ విసిరారు. బుధవారం ఆయన మడకశిరలోని తన స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. పెనుకొండలో జరిగిన 'రా కదలిరా' సభలో చంద్రబాబు తాను ఇసుక దందా చేసినట్లు ఆరోపించారని, దాన్ని నిరూపించాలన్నారు. తాను ఏరోజూ కూడా అసాంఘిక పనులను ప్రోత్సహించలేదన్నారు. వైఎస్సార్ సీపీకి వస్తున్న ప్రజాదరణతో ఓటమి ఖాయమని తెలుసుకున్న చంద్రబాబు మతిస్థిమితం కోల్పోయి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. కుప్పంలో ఎమ్మెల్యేగా కూడా చంద్రబాబు గెలిచే అవకాశం లేదన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఎల్లో మీడియా అంతా ఏకమైనా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏం చేయలేరన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ పవనాలు వీస్తున్నాయని, 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో 'ఫ్యాన్' ప్రభంజనం ఖాయమన్నారు. చంద్రబాబు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేయడాన్ని మానుకోవాలని ఎమ్మెల్యే హితవు ఇచ్చారు. లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ముస్లింలకు గంట వెసులుబాటు

పుట్టపర్తి: రంజాన్ పురస్కరించుకుని ముస్లిం ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి ప్రభుత్వం గంట వెసులుబాటు కల్పించింది. రంజాన్ మాసంలో (ఈ నెల 11 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు) రోజా పాటించే వారికి ఇబ్బంది కలగకుండా వారంతా గంట ముందుగానే వెళ్లవచ్చని ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే సిబ్బందితో పాటు మండల విద్యా శాఖ కార్యాలయాలు, సమగ్ర శిక్ష కార్యాలయాల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ సిబ్బందికీ ఈ వెసులుబాటు ఉంటుందన్నారు.

జనమంతా 'ఫ్యాన్' కిందకే

- జిల్లాలో వైఎస్సార్‌సీపీ హవా
- వెల్లువలా పార్టీలోకి చేరికలు
- క్రమంగా ఖాళీ అవుతోన్న టీడీపీ
- సతమతమవుతున్న తెలుగు తమ్ముళ్లు



కేతిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలోకి చేరికలు

సాక్షి, పుట్టపర్తి

సార్వత్రిక ఎన్నికల హీట్ పెరుగుతున్న వేళ...జనమంతా చల్లగాలి కోసం ఫ్యాన్ కిందకు చేరుతున్నారు. ఇన్నాళ్లూ సైకిల్‌పై తిరిగిన వారూ.. పొత్తుల వేళ ఏ జెండా మోయాలో తెలియక జగన్‌కే మద్దతు తెలుపుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ వీడుతున్న వారి సంఖ్య మరింత ఎక్కువైంది. జిల్లాలో నిత్యం ఏదో గ్రామంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు కనిపిస్తున్నాయి.

టీడీపీ అధిష్టానంపై అలక

అభ్యర్థుల తొలి జాబితా విడుదలతో టీడీపీ అధిష్టానంపై కార్యకర్తలు అలకబూనారు. టికెట్ల కేటాయింపు సరిగా లేదని భావించిన వారంతా ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నారు. దీనికి తోడు జనసేనతో పొత్తును 'తమ్ముళ్లు' జీర్ణించుకోలేకపోతున్నారు. సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపు మొగ్గు చూపుతున్నారు. మరోసారి వైఎస్ జగన్ సీఎం కావాలని కోరుతూ వైఎస్సార్‌సీపీలోకి వచ్చేస్తున్నారు.

ధర్మవరంలో వరుస చేరికలు

ధర్మవరంలో టీడీపీ ఖాళీ అయ్యింది. పరిటాల శ్రీరామ్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నా... ధర్మవరం టికెట్ తనదేనంటూ వరదాపురం సూరి చెబుతుండగా తమ్ముళ్లు సందిగ్ధంలో పడిపోయారు. మరోవైపు ఆధిపత్య పోరులో రోజురోజుకూ వరదాపురం సూరి, పరిటాల శ్రీరామ్ వర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటుండగా.. కార్యకర్తలంతా టీడీపీ వీడుతున్నారు. గతంలో రాప్తాడులో అరాచకాలు చేసి.. ధర్మవరంలో కూడా అల్లర్లు చేయడం మొదలు పెడుతున్నారని పరిటాల శ్రీరామ్‌పై టీడీపీ కార్యకర్తలే విమర్శలు చేస్తున్నారు. నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలంటే.. వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపడమే మంచిదన్న నిర్ణయంతో అంతా ఫ్యాన్‌కు జై కొడుతున్నారు.

పుట్టపర్తిలో భారీ దెబ్బ

పుట్టపర్తిలోనూ తెలుగు తమ్ముళ్ల పరిస్థితి అయోమయంగా మారింది. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అనంతపురంలో కూర్చుని రాజకీయం చేస్తుండగా, స్థానికంగా అండగా నిలిచే నేత లేక తమ్ముళ్లంతా తలోదారి పట్టారు. పైగా పల్లెకు స్థానిక సమస్యల పట్ల అవగాహన లేకపోవడంతో ఆయన వెంట నడిచేందుకు కార్యకర్తలు ఇష్టపడటం లేదు. వైఎస్సార్ సీపీతోనే సంక్షేమ రాజ్యం వస్తోందని భావిస్తున్నారు. అందువల్లే నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోనూ టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి. కొత్తచెరువు, అమడగూరు, బుక్కపట్నం, ఓడీ చెరువులో ఇటీవల కాలంలో వెయ్యి కుటుంబాలకు పైగా వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి.

పెనుకొండలో మంత్రికి ఆదరణ

చాలా ఏళ్లుగా టీడీపీ ప్రాతినిథ్యం వహించిన పెనుకొండలో 2019లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరింది. అప్పటి నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ హవా కొనసాగుతోంది. మంత్రి ఉషశ్రీచరణ్ రాకతో.. టీడీపీ వర్గీయులు ఉత్సాహంగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. మరోవైపు టీడీపీలో సవితకు టికెట్ ఇవ్వడంతో బీకే వర్గీయులు నైరాశ్యంలో మునిగిపోయారు. ఈ క్రమంలో పార్టీ వీడుతున్న వారిని ఏం చెప్పి నిలువరించాలో తెలియక లోలోపల కుమిలిపోతున్నారు. నాలుగు రోజుల క్రితం పరిగి మండలంలో టీడీపీకి మద్దతుగా ఉన్న 450 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరడం గమనార్హం.

జిల్లా వ్యాప్తంగా ఫ్యాన్ జోరు

రాప్తాడు, కదిరి, మడకశిర, హిందూపురంలోనూ టీడీపీ వీడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇన్‌చార్జ్‌లుగా ఒకరు.. అభ్యర్థిగా మరొకరు.. అసమ్మతిలో ఇంకొందరు.. ఇలా టీడీపీలో గ్రూపులు ఏర్పాటు కావడంతో ఎవరి వెంట నడవాలో తెలీక కార్యకర్తలంతా పార్టీ వీడుతున్నారు. ఇచ్చిన మాట తప్పకుండా ప్రతి హామీ అమలు చేసిన వైఎస్ జగన్ చెంతన ఉంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని ధీమాగా చెబుతున్నారు.

ప్రకృతి వ్యవసాయం భేష్

- విదేశీ ప్రతినిధుల బృందం ప్రశంస
- మడకశిర, రొళ్ల మండలాల్లో పర్యటన
- ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పరిశీలన



రత్నగిరిలో ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే సార్వత్రిక సూత్రాలను పరిశీలిస్తున్న విదేశీ బృందం

రొళ్ల/మడకశిర రూరల్: జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ న్యాచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) ప్రాజెక్ట్ ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు అద్భుతమైన సత్ఫలితాలు ఇస్తున్నాయని ఈజిప్ట, యూరప్ దేశాలకు చెందిన ప్రతినిధుల బృందం సభ్యులు ప్రశంసించారు. రైతు సాధికార సంస్థ ద్వారా రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించడం కోసం ఈజిప్ట, యూరప్ దేశాలకు చెందిన వాల్టర్ లింక్, లూసీ వాలెస్, మెల్లిసా, హెల్మీ అబౌలీష్, అమర్ సహాబి, జస్టస్ హాని, అబౌలీష్ తదితరులు బుధవారం రొళ్ల, మడకశిర మండలాల్లో పర్యటించారు. తొలుత రొళ్ల మండలం రత్నగిరి గ్రామంలో పర్యటించారు. అంబిక, దొడ్డేగౌడు, సుమలత, మంజునాథ్, నాగరాజు, శంకర్ తదితరులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగుచేసిన వివిధ రకాల పంటలను పరిశీలించారు. అనంతరం రత్నగిరిలోని విశ్రాంతి భవనంలో మహిళా రైతులతో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంలో అనుసరిస్తున్న విధానాలతో పాటు ప్రాజెక్ట్ అమలులో మహిళ సంఘాల కీలక పాత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో కీలక పాత్ర పోషించే ఘన, ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ ప్రకృతి వ్యవసాయ విధానంలో అనుసరిస్తున్న తొమ్మిది సార్వత్రిక సూత్రాలను విదేశీ బృందానికి వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో అత్యంత తక్కువ వర్షపాతం కలిగిన శ్రీ సత్యసాయి జిల్లాలో ఏడాది పొడవునా పంటలు పండించగలుగుతున్నామని తెలిపారు. అనంతరం విదేశీ ప్రతినిధుల బృందం సభ్యులు మడకశిర మండలంలోని కొత్తలం గ్రామంలో రైతు రవి ప్రతాప్‌రెడ్డి పొలాన్ని సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా 6 ఎకరాల్లో సాగు చేసిన దానిమ్మ పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, థిమాటిక్ లీడ్‌లు సుధాకర్, సురేష్, ప్రవీణ్, ఎస్ఆర్పీ నరేంద్రకుమార్, జిల్లా కోఆర్డినేటర్ భానుమతి, ఎంఎంఎల్‌టీ గంగయ్య, మాస్టర్ ట్రైనర్ రమేష్, జిల్లా ఏఓ కృష్ణ చైతన్య, మండల ఇన్‌చార్జ్ హనుమంతరాయప్ప, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు చిత్రంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ తదితరులు

- రూ.105.03 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల
- 1,17,005 మంది రైతులకు లబ్ధి
- రైతులకు మెగా చెక్కు అందజేసిన కలెక్టర్, ప్రజాప్రతినిధులు

పుట్టపర్తి అర్బన్: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ఖరీఫ్‌లో వర్షాభావంతో పంటలు నష్టపోయిన జిల్లాలోని 1,17,005 మంది రైతులకు రూ.105,03,82,000 నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో కంప్యూటర్‌లో బటన్‌నొక్కి ఖాతాల్లో జమ చేశారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు జిల్లా రైతులకు మెగా చెక్కు అందజేశారు.

అన్ని వర్గాలను మోసం చేసిన చంద్రబాబు

తన స్వార్థ రాజకీయం కోసం చంద్రబాబు గతంలో రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేశారని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ అన్నారు. మెగా చెక్కు పంపిణీ అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. అప్పట్లో చంద్రబాబు రైతాంగాన్ని పూర్తిగా విస్మరించి వ్యవసాయాన్ని నవ్వుల పాలు చేశారన్నారు. నాడు రుణమాఫీని ఎగ్గొట్టి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని రైతుల ఓట్లు అడుగుతున్నాడో అర్థం కావడం లేదన్నారు. రైతులనే కాకుండా డ్వాక్రా రుణాలు మాఫీ పేరుతో మహిళలను, విద్యార్థులను, యువతను మోసగించారన్నారు. ఆయన్ను రాష్ట్రం నుంచి తరిమేసే రోజులు దగ్గర్లనే ఉన్నాయన్నారు.

ముంగిళ్లలోనే పథకాలు



సీఎం వైఎస్ జగన్ అందించే ప్రతి పథకమూ మాకు అందుతోంది. వలంటీర్ వ్యవస్థతో పథకాలన్నీ ముంగిళ్లలోనే అందుతున్నాయి. నా కుటుంబానికి ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ, వృద్ధాప్య పింఛన్, ఆసరా, చేయూత, విద్యాదీవెన, అమ్మ ఒడి, వసతి దీవెన వంటి పథకాలతో సుమారు రూ.5.3 లక్షల లబ్ధి చేకూరింది. ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వమూ మమ్మల్ని పట్టించుకున్న పాపాన పోలేదు. రైతులకు ప్రతి అడుగులోనూ తోడుగా ఉంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిది.

– కేశవమూర్తి, రైతు, గుడ్డదహళ్లి, గుడిబండ మండలం

నమ్మకానికి ప్రతిరూపం జగన్



సీఎం వైఎస్ జగన్ నమ్మకానికి ప్రతిరూపంలా నిలిచారు. ఇచ్చిన హామీలే గాక చెప్పనివీ అమలు చేశారు. అలాగే ఎలాంటి సిఫారసు లేకుండా అర్హతే ఆధారంగా ప్రతి పథకాన్నీ అందించారు. అందుకే అర్హులందరికీ పథకాలు అందుతున్నాయి. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి మేలు జరిగింది. అందుకే మీకు లబ్ధి చేకూరితేనే ఓటు వేయండని అడుగుతున్నారు. ఇలాంటి నాయకుడు దేశంలో జగనన్న ఒక్కరే ఉంటారు.

– రాజేంద్రప్రసాద్, రైతు, మామిళ్లకుంట క్రాస్, పుట్టపర్తి మండలం

క్లుప్తంగా

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి ఖాదీ ఎగ్జిబిషన్

హిందూపురం అర్బన్: ఈ నెల 8 నుంచి హిందూపురంలోని రైల్వే కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్ర స్థాయి ఖాదీ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) ఏపీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.గ్రీప్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రదర్శన ప్రారంభం కానుంది. ఖాదీ ఉత్పత్తులకు ప్రాధాన్యతకలిపిస్తూ తలపెట్టిన ఈ ప్రదర్శనకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారితో 60కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు.

మహిళ మృతదేహానికి అంత్యక్రియలు



గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: చెరువు నీటిలో తేలియాడుతున్న మహిళ మృతదేహాన్ని పోలీసులు వెలికి తీసి అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు... బుక్కపట్నం చెరువులో కొత్తచెరువు నాగులకనుమ వద్ద ఓ మహిళ మృతదేహాన్ని స్థానికులు బుధవారం ఉదయం గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి, కొత్తచెరువు పంచాయతీ కార్మికులతో ఖననం చేయించారు.

78 మందికి ఉద్యోగాల కల్పన



ఆఫర్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాలో 78 మందికి ఉద్యోగావకాశాలు దక్కాయి. ప్రిన్సిపాల్ ప్రగతి అధ్యక్షతన బుధవారం కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొని 186 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి కంపెనీ ప్రతినిధులు ఆఫర్ లెటర్లను అందజేశారు. కాగా ఉద్యోగాలకు ఎంపిక కాబడిన వారిలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల చెందిన 50 మంది ఉండడంపై ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు తేజ్‌కుమార్‌రెడ్డి, సాయి గణేష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, శ్రీధర్, శ్రీలక్ష్మీ, సుబ్బరాయుడు, నాగార్జున, అఫ్సానా, అమరేష్ తదితరులు పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే మహా వృక్షం

- శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన తిమ్మమ్మ మర్రిమాను
- నేటి నుంచి జాగరణ మహోత్సవాలు
- అధిక సంఖ్యలో హాజరుకానున్న భక్తులు



కోర్కెలు తీర్చాలంటూ ముడుపులు కట్టిన దృశ్యం

ఎన్‌పీకుంట/కదిరి అర్బన్: దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద వృక్షంగా పేరుగాంచిన తిమ్మమ్మ మర్రిమాను మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. కోరిన కోర్కెలు తీర్చే మహావృక్షంగా ఖ్యాతి గాంచిన తిమ్మమ్మ మర్రిమాను వద్ద గురువారం నుంచి శివరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే తిమ్మమాంబ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పూర్తి చేశారు.

ప్రపంచ పర్యాటక కేంద్రంగా...

ఎన్‌పీ కుంట మండలం గూటిబైలు గ్రామంలో వెలసిన తిమ్మమ్మ మర్రిమాను 8.15 ఎకరాల్లో వేలాది ఊడలతో విస్తరించింది. ఈ మహావృక్షం వెనుక ఓ పురాణగాథ ఉంది. బుక్కపట్నానికి చెందిన వెంకటప్ప, మంగమాంబ దంపతులకు కుమార్తె తిమ్మమాంబకు గూటిబైలుకు చెందిన బాలవీరయ్యతో వివాహమైంది. కొన్నాళ్లపాటు వీరి జీవితం బాగానే సాగింది. ఈ క్రమంలోనే అనారోగ్యం బారిన పడిన వీరయ్య మృతి చెందడంతో ఆ రోజుల్లో కొనసాగుతున్న ఆచారం మేరకు తిమ్మమాంబ సతీసహగమనానికి సిద్ధమైంది. చితిలోకి దూకేందుకు ఎత్తుకోసం నాలుగు ఎండిన మర్రి గుంజలను (కట్టెలు) నాటారు. ఆ నాలుగింటిలో ఈశాన్య దిశలో నాటిన గుంజం చిగురించి అది మహావృక్షంగా ఎదిగింది. అప్పటి నుంచి ఈ చెట్టుకు 'తిమ్మమ్మ' అనే పేరు పెట్టారు. 1989లో కర్ణాటక ప్రాంతానికి చెందిన జర్నలిస్టు సత్యనారాయణ అయ్యర్ కృషి ఫలితంగా ఈ మహా వృక్షం గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు దక్కించుకుంది. అప్పటి నుంచి ప్రపంచ పర్యాటకుల దృష్టి తిమ్మమ్మ మర్రిమానుపై పడింది. మొత్తం 1,355కు పైగా ఊడలతో ఉండే ఈ మర్రిమానుకు దాదాపు 660 సంవత్సరాలు నిండాయి. ఈ ప్రాంతంలో నిర్మించిన తిమ్మమాంబ, బాలవీరయ్య ఆలయాన్ని 2011లో బెంగళూరుకు చెందిన కైవారం యోగి నారాయణస్వామి ట్రస్ట్ ధర్మాధికారి డాక్టర్ ఎంఎస్ జయరాం ఆధ్వర్యంలో అభివృద్ధి చేశారు. నూతన ఆలయంలో తిమ్మమాంబ అమ్మవారు నిత్యపూజలతో అలరారుతున్నారు. ఆలయానికి ఎదురుగా తిమ్మమాంబ సతీసహగమనం చేసిన ప్రదేశంలో తిమ్మమ్మ ఘాట్‌ను అత్యంత సుందరంగా నిర్మించారు. ఇక్కడికి వచ్చే యాత్రికులకు, భక్తులకు తిమ్మమ్మ చరిత్ర, మర్రిమాను విశిష్టతను వివరించేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఇద్దరిని గైడ్‌లుగా నియమించారు.



ప్రత్యేక అలంకరణలో తిమ్మమాంబ మూలవిరాట్



తిమ్మమ్మ మర్రిమాను బాహ్య చిత్రం



తిమ్మమాంబ, బాలవీరయ్య విగ్రహాలు



తిమ్మమ్మ సతీసహగమనం చేసిన ప్రదేశంలో ఏర్పాటు చేసిన స్మారకం

ఉత్సవాలకు ఏర్పాట్లు

ఈ నెల 7న గురువారం ఉదయం అమ్మవారి రథోత్సవంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. గ్రామ వీధులతో పాటు సమీప గ్రామాల్లో అమ్మవారి రథోత్సవాన్ని నిర్వహిస్తారు. 8న మహాశివరాత్రిని పురస్కరించుకుని తిమ్మమ్మ మర్రిమాను వద్ద జాగరణ ఉంటుంది. తిమ్మమాంబ సంపూర్ణ జీవిత చరిత్రను బుర్రకథ రూపంలో మంగదిన్నెపల్లి రమణప్పనాయుడు బృందం వివరించే ఏర్పాట్లు చేశారు. అలాగే చెక్కభజనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను పెద్ద ఎత్తున్న నిర్వహించనున్నారు. ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాక పొరుగున ఉన్న అన్నమయ్య, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. 9న అమ్మవారికి మొక్కుబడులు సమర్పించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించిన అనంతరం తిరిగి వెళతారు. కాగా, అమ్మవారి రథోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పాల్గొననున్నారు. ఈ మేరకు ఎన్‌పీకుంట ఎంపీపీ ఈటె రాము బుధవారం తెలిపారు. గురువారం రాత్రి 7 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారి రథాన్ని లాగి జాగరణ మహోత్సవాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఇలా చేరుకోవచ్చు...

తిమ్మమ్మ మర్రిమాను వద్దకు చేరుకునేందుకు ప్రధానంగా రెండు మార్గాలు ఉన్నాయి. కదిరి–రాయచోటి మార్గంలో ఉన్న గాండ్లపెంట మండలం రెక్కమాను నుంచి ఆటోలు, బస్సులు ఉంటాయి. 8 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తే మర్రిమానుకు చేరుకోవచ్చు. అలాగే కదిరి–మదనపల్లి జాతీయ రహదారిపై కొక్కంటి క్రాస్ నుంచి ఆటో, బస్సుల్లో 12 కిలోమీటర్లు ప్రయాణించి మర్రిమానుకు చేరుకోవచ్చు. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కదిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ మేరకు డిపో మేనేజర్ మైనుద్దీన్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కదిరి బస్టాండ్ నుంచి ప్రతి 30 నిమిషాలకు ఒక బస్సు చొప్పున గాండ్లపెంట, రెక్కమాను మీదుగా బయలుదేరుతుంది. కదిరిలోని జీవిమాను సర్కిల్, గాండ్లపెంట రెక్కమాను, తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌లో ప్రత్యేక స్టాపింగ్‌లు ఏర్పాటు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

- మృతుడు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ భర్త



నాగరాజు (ఫైల్)

హిందూపురం అర్బన్: స్థానిక మేళాపురం సమీపంలోని దండురోడ్డు వద్ద నివాసముంటున్న 43వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ నాగమణి భర్త నాగరాజు (55) మంగళవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు... తమిళనాడు నుంచి కొన్నేళ్ల క్రితమే హిందూపురానికి వలస వచ్చిన నాగరాజు కుటుంబం... దండురోడ్డు సమీపంలో నివాసముంటూ తినుబండారాల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపల్ కౌన్సిల్ స్థానానికి వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి ఆయన భార్య నాగమణి గెలుపొందారు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన భర్తలో మార్పు తీసుకువచ్చేందుకు పరిపరి విధాలుగా ఆమె ప్రయత్నించారు. సమాజంలో ఓ ప్రత్యేక గుర్తింపు దక్కిన ప్రస్తుత తరుణంలో తాగుడు అలవాటు మంచిది కాదని చెప్పినా ఆయన వినేవారు కాదు. దీంతో ఎలాగైనా తాగుడు మాన్పించాలని నిర్ణయించుకున్న కుటుంబసభ్యులు ఆ మేరకు నాగరాజును కట్టడి చేస్తూ వచ్చారు. దీంతో మనస్తాపం చెందిన ఆయన మంగళవారం సాయంత్రం ఎలుకల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక బుధవారం ఉదయం ఆయన మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి, తదితరులు ఆస్పత్రికి చేరుకుని నాగరాజు మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. కాగా, మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై ఎస్‌ఐ హనూర్‌బాషా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి బలవన్మరణం

చిలమత్తూరు: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... చిలమత్తూరు మండలం కుందుర్తి గ్రామానికి చెందిన మధువర్ధన్‌రెడ్డి (23) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉందని కేసు దర్యాప్తు చేపట్టిన ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు.

అభివృద్ధి చేసి చూపించాం

- ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలి
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ
- అనంతపురం రూరల్ మండలం తాటిచెర్లలో ప్రచారం ప్రారంభం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ (చిత్రంలో) జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు

రాప్తాడురూరల్: దశాబ్దాలుగా వెనుకబడిన రాప్తాడు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపించామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. అనంతపురం రూరల్ మండలం తాటిచెర్లలో బుధవారం వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మతో కలసి ఆయన ఎన్నికల శంఖారావం పూరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు వైటీ శివారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.30 లక్షల నిధులతో తాటిచెర్ల రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల కోడ్ వచ్చేలోపు పనులు కూడా ప్రారంభమవుతాయన్నారు. తాటిచెర్ల చెరువుకు నీళ్లు తీసుకొచ్చే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు రూ.65 లక్షల దాకా ఖర్చవుతుందన్నారు. ప్రభుత్వం నుంచి ఆలస్యమయ్యే పరిస్థితి ఉంటే ఈ మొత్తాన్ని గ్రామపెద్దల చేతుల్లో పెట్టి ఎన్నికలకు వెళతామని ప్రకటించారు.

పరిటాల సునీత చేసిందేమీ లేదు..

పదేళ్ల పాటు ఈ ప్రాంతానికి పరిటాల సునీత ఎమ్మెల్యే, మంత్రిగా పని చేసినా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. 2019 ఎన్నికల్లో తాను గెలిచిన తర్వాత నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా 17 వేల ఇళ్లను మంజూరు చేయించామన్నారు. 2 వేలమంది పేద రైతులకు ఉచితంగా బోర్లు వేయించామన్నారు. 4 వేల మంది మహిళల జీవనోపాధులకు 11.50 ఎకరాల్లో గార్మెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆరు నెలల్లో నిర్మాణ పనులు కూడా పూర్తవుతాయన్నారు. మహిళా పాడిరైతులకు అండగా నిలుస్తూ రూ.20 కోట్ల సొంత నిధులతో అమ్మ డెయిరీ ఏర్పాటు చేశామన్నారు. పేరూరు డ్యాంకు నీళ్లు విడుదల చేయించడంతో పాటు రామగిరిలోని బంగారు గనులను తెరిపిస్తున్నామన్నారు. రూ.1,500 కోట్లతో 300 మెగావాట్ల సోలార్ హైబ్రీడ్ పవర్ ప్లాంట్ తీసుకొచ్చామన్నారు. నియోజకవర్గంలో రూ.5 వేల కోట్లతో 1,050 మెగావాట్ల సోలార్ ఉత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేయించుకున్నట్లు తెలిపారు. అనంతపురం రూరల్ మండలంలో 7 వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. మంత్రిగా పని చేసిన పరిటాల సునీత తాటిచెర్ల గ్రామానికి కనీసం 14 ఇళ్లు తీసుకురాలేదన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. చంద్రబాబు వస్తే కరువు వస్తుందనేది చాలామార్లు రుజువైందన్నారు. అలాంటి బాబును నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయయాదవ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్లు మఠం శ్యాంసుందర్, జయచంద్రారెడ్డి, యూత్ మండల కన్వీనర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, తాడిపత్రి శీనా, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



ఫ్యాన్ గుర్తు చూపుతున్న ప్రకాష్‌రెడ్డి

తాగునీటి సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్

పుట్టపర్తి అర్బన్: వేసవిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు ప్రత్యేకంగా కాల్‌సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మల్లికార్జునప్ప తెలిపారు. ఈమేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొన్న వెంటనే 08555–292439కు సమాచారం అందించాలన్నారు. ఉదయం 8 నుండి రాత్రి 8 గంటల వరకూ ఈ నంబర్ పని చేస్తుందన్నారు. సమస్య తెలిపిన వెంటనే గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు అక్కడకు చేరుకుని చర్యలు తీసుకుంటారన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లండి

- రోగులే గురువులు... వారికి మెరుగైన సేవలందించాలి
- డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కోరుకొండ బాబ్జీ
- సూపర్ స్పెషాలిటీలో ఘనంగా 2కే18 వైద్య విద్యార్థుల స్నాతకోత్సవం
- డిగ్రీలు అందుకున్న వంద మంది విద్యార్థులు



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ బాబ్జీ

అనంతపురం మెడికల్: ఎంతో గౌరవప్రదమైన వైద్య వృత్తిలో అడుగుపెడుతున్న వారందరూ ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జీ పిలుపునిచ్చారు. అనంతపురం వైద్య కళాశాల 2కే18 బ్యాచ్ వైద్య విద్యార్థుల స్నాతకోత్సవం బుధవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా ఆయనతో పాటు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు హాజరయ్యారు.

ప్రణాళికతోనే రాణింపు

వీసీ బాబ్జీ మాట్లాడుతూ.. ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగినప్పుడే వైద్య వృత్తిలో రాణింపు ఉంటుందన్నారు. ఆస్పత్రుల్లో ఉండే రోగులనే ప్రథమ గురువులుగా భావించాలన్నారు. రోగుల సమస్యను ఓపికగా తెలుసుకుని, పరిష్కారం చూపించే క్రమంలో చేస్తున్న ప్రతి చికిత్స ఓ పరిశోధన కావాలన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఏర్పాటైన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వివిధ రకాల రోగులకు అత్యుత్తమ వైద్యసేవలు అందుతుండడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడితో ఆగిపోకుండా వైద్య రంగంలో నిరంతర పరిశోధనలు సాగించాలని వైద్య విద్యార్థులు, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు, ప్రొఫెసర్లు, సూపర్ స్పెషాలిటీ వైద్యులకు సూచించారు. అనంతరం ఎంబీబీఎస్ పూర్తి చేసిన వంద మందికి డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ బాబ్జీను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ షారోన్, డాక్టర్ నవీన్‌కుమార్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ షంషాద్‌బేగం, సీనియర్ వైద్యులు పాల్గొన్నారు.

మా కుటుంబంలో నేనే మొదటి డాక్టర్



నాన్న బన్సోత్ కుల్లాయప్ప, అమ్మ సుభద్రబాయి. మాది వ్యవసాయ కుటుంబం. విద్యార్థి దశ నుంచే నన్ను డాక్టర్‌ను చేస్తామని అమ్మ, నాన్న తరచూ చెప్పేవారు. వారి ఆశయం మేరకు వైద్య వృత్తి చేపట్టాలని నిర్ణయించుకుని ఆ దిశగా శ్రమించాను. ఎంబీబీఎస్ చదివే రోజుల్లోనే వివాహం జరిగింది. కానీ ఏనాడు ఇబ్బంది పడలేదు. భర్త లక్ష్మణ్, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎంబీబీఎస్ పూర్తి చేశా. మా కుటుంబంలో నేనే మొదటి డాక్టర్‌ని. రేడియాలజిస్టు కావాలన్నదే లక్ష్యం.

– డాక్టర్ బన్సోత్ కుల్లాయమ్మ, ఆర్‌ఎస్ తండా, ముదిగుబ్బ

జీవనోపాధుల పెంపునకే 'విశ్వకర్మ యోజన'

- డీఆర్‌డీఏ పీడీ నరసయ్య



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

పుట్టపర్తి అర్బన్: చేతివృత్తులపై ఆధారపడిన వారి జీవనోపాధుల పెంపునకే ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య అన్నారు. విశ్వకర్మ యోజనపై పుట్టపర్తిలోని ఆర్‌వీ జానకీరామయ్య కల్యాణ మంటపంలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కులమతాలతో సంబంధం లేకుండా చేతివృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడమే కాక, జీవనోపాధులు కల్పించేలా పీఎం విశ్వకర్మ యోజన పథకానికి రూపకల్ప చేశారన్నారు. పథకంలో లబ్ధి పొందేందుకు 18 సంవత్సరాలు పైబడిన పట్టణాలతో పాటు మండలాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలు, సంప్రదాయ చేతివృత్తిదారులు అర్హులన్నారు. నైపుణ్యాల మెరుగుదలకు 7 నుంచి 15 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో రూ.500 స్టైయిఫండ్ చెల్లిస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్‌తో పాటు పనిముట్ల కొనుగోలుకు రూ.15వేలు, తొలి విడతలో రూ.1లక్ష రుణం అందజేస్తారన్నారు. రుణం కంతులు సక్రమంగా చెల్లిస్తే రూ.3 లక్షల వరకూ 5శాతం వడ్డీతో రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ ఏడీ వీరయ్య, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ చాంద్‌బాషా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శేఖర్, ఎల్‌డీఎం రమణకుమార్, ఈపీఎం రామమోహన్, స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ రమేష్ పలువురు చేతివృత్తిదారులు, మహిళా సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలు



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్‌రాజు

ప్రశాంతి నిలయం: సత్యసాయి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ పని చేస్తోందని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం సమకూర్చిన 12 సీటర్ వాహనాన్ని బుధవారం ప్రశాంతి నిలయంలోని గణేష్ గేట్ వద్ద ఆయన ప్రారంభించారు. ఇప్పటికే ప్రశాంతి నిలయంలో ఇదే తరహాకు చెందిన 3 వాహనాలు పనిచేస్తున్నాయి. తాజాగా మరో వాహనాన్ని సమకూర్చారు. ఈ వాహనాల్లో భక్తులను ప్రశాంతి నిలయంలో ఓ చోటు నుంచి మరో చోటుకు తరలించేందుకు వినియోగిస్తున్నారు. ఈ సందర్భంగా రత్నాకర్‌రాజు మాట్లాడుతూ... వృద్ధులు, దివ్యాంగులు, మహిళలను ఓ చోటు నుంచి మరో చోటుకు సులువుగా తీసుకెళ్లేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు.